

# కట్నం

శ్రీ సరిపల్లి నరసింగరావు

సుందరమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు భర్తపోయి రెండు సంవత్సరా లయింది. అప్పటినుండి సంసార నిర్వహణ భారమంతా ఆమె భుజాలమీద పడింది. మొదటి కుమారుడు భాస్కరరావుకు ఇరవై ఏళ్లుంటాయి. కొత్తగా ఉద్యోగంలో ప్రవేశించాడు. భార్యాకూడా కాపురాని కొచ్చింది.

రెండవ కుమారుడు మురళీకి ఆరేళ్ళుంటాయి. మురళీ పూర్తిపేరు "మురళీ ధరరావు" ఇతడే ఆఖరి కాన్పు. ఈ చిన్నబ్బాయి అప్పుడే బడిలోకి వెళ్లటం నేర్చుకుంటున్నాడు. మురళీని వాళ్ల జ్ఞాతులకే దత్తత ఇచ్చారు. ఆ దత్తత పుచ్చుకున్న దంపతులు హారీ మంటేగాని దత్తుడికి దత్తుడికి ఆస్తి దఖలుపడదని, మురళీవెళ్లి వాళ్లచేత ఆకాస్త పనిచేయించాడు. అప్పటి నుండి మురళీ తాలూకు దత్తత ఆస్తి- "ఏటా నాలుగు వందలొచ్చే భూములు సుందరమ్మగారు కాపురమున్న ఇల్లు"-భాస్కరరావు చూస్తున్నాడు. సుందరమ్మ పెద్ద కుమార్తె రత్నాన్ని సుబ్బారావు కిచ్చారు. సుబ్బారావు అట్టే ఆస్తిపరుడు కాకపోయినా, కాలేజీలో లైబ్రేరియన్‌గా వుండి, నెలకు నలభై తెచ్చుకుంటున్నాడు.

సుందరమ్మ రెండో కూతురు, కృష్ణవేణికి, పదమూడేళ్ళుంటాయి. అవయవ నిర్మాణం-క్వెట్టా సైనిక గృహాల్లాగ—అతివేగం పూర్తికావడంవల్ల, పెళ్ళియీడు మించిపోతున్నాదని అందరు తహతహలాడుతున్నారు.

ఇవీ సుందరమ్మ కుటుంబ పరిస్థితులు.

౨

సుబ్బారావు, భార్యను, పురిటికి పంపేసి, శుభలేఖ కోసం ఎదురు తెన్నులు చూస్తున్నాడు. చివర కొకనాడు రాత్రి హోటలునుంచి భోజనంచేసి వచ్చేసరికి, టెలిగ్రాఫ్ బంట్రోతు గుమ్మంలో ఎదురుచూస్తున్నాడు. సుబ్బారావు సహజభీరులైనప్పటికి, కొంచెం

ఆందోళన పడ్డాడు. ఇది టెలిగ్రాఫ్ బంట్రోతు కనిపెట్టి "పంతులుగారూ! భయపడకండి. శుభవర్తమానమే!" అన్నాడు చిరునవ్వుతో. "అలాగా" అని కవరుచింపి "కుమార్తె కలిగింది; తల్లీ, పిల్ల కులాసాగా వున్నారు" అని చదువుకొని, ఆ బంట్రోతుకు అర్ధరూపాయి బహుమానం ఇచ్చాడు............

ఆరు రోజులయింది. ఆ టెలిగ్రాం తప్ప మరి వుత్తరంలేదు. అతనికి పరిపరి విధాలపోయింది. మనస్సుకు శాంతిలేదు. అందులో ఆవేళ దుశ్శకునాలు మరీ ఎక్కువగా కనిపిస్తున్నాయి. మనస్సు, తుపాను సముద్రంలో ఓడలాగ, వూగి సలాడుతున్నాది.

ఒకసారి వెళ్లిచూద్దామా? అంటే శెలవులేదు. చివరకు వూరుకోబట్టక "తల్లీ, పిల్లలు ఎలాగ వున్నారు?" అని టెలిగ్రాం ఇచ్చేశాడు. దానికి జవాబు "తల్లికి చాలా జబ్బుగా వుంది. పిల్లకులాసాగా వుంది. వెంటనే బయలుదేరి రావలసింది" అని వచ్చింది. అంత మనిషీ నిలువునా కూలిపోయాడు. కళ్లంట గిరగిర నీళ్ళు తిరిగాయి. ఓ పావుగంటకు తెప్పరిల్లి, మాసినబట్టలైన మార్చకుండా, ఆ చింపిరితలతోనే, పిచ్చివాడిలాగ ప్రిన్సుపాలుగారి దగ్గరకువెళ్లి, ఆ టెలిగ్రాం చూపెట్టి, శెలవు పుచ్చుకొని, బయలుదేరాడు బరువైన హృదయంతో.

ఇంకేముంది? సుబ్బారావు వెళ్లేసరికి అంతా అయిపోయింది. భూనభోంతరాళాల్ని ముట్టిన శోకధ్వనులు......అమితమైన విచారంవల్ల సుబ్బారావు అలా కొయ్యబారి పోయాడు. రత్నంవంటి రత్నాన్ని కోల్పోయాడు. వెనుకటి సంగతులన్నీ సినీమా రీలులాగ అతని మనుస్సులో దొర్లిపోతున్నాయి. అవి- అందులో రత్నం అసమాన సౌందర్యం, అమాయకపు బుద్ధి, పతిభక్తి-తలుచుకుంటే పొర్లి, పొర్లి వచ్చేసింది దుఃఖం ఆడదానిలాగ బావురుమన్నాడు. తరువాత జరిగిన కలాపాలు రాయటానికి కలం ఆడటంలేదు...

3

కృష్ణపక్షం గడిచిపోయింది. శుక్లపక్షం ప్రవేశించింది. రత్నం తనరక్త మాంస స్వరూపాదులతో విడిచిపోయిన పిల్లయందే అందరి ఆలోచనలు కేంద్రీకరింపబడ్డాయి. అందరి హృదయాకాశాల్లోంచి విడివడుతున్న దుఃఖావృత మేఘాల్లోంచి. తన లేతకిరణాలతో ప్రకాశిస్తున్నాది శిశుబింబం.

సుబ్బారావు, అతని తల్లీ, తండ్రి కూచొని వుండగా సుందమ్మ తన వుద్దేశ్యం చెప్పలేక చెప్పలేక చెప్పవలసి వచ్చింది. "నాయనా! సుబ్బారావూ! నేనిలా చెబుతున్నానని మరోలాగ అనుకోకు. భార్యా ఐనందుకు నువ్వెంత దుఃఖపడుతున్నావో, కూతుర్తె ఐనందుకు అంతకంటె పదిరెట్లు కుమిలిపోతున్నాను-మనం ఈ పన్నెండురోజుల పసికందును (అని వళ్లోవున్న శిశువును చూపిస్తుంది) చూసి దుఃఖం దిగమింగుకోవాలి. దానికూతురైన ఈ పిల్లను జాగ్రత్తగా చూసుకొంటే, దాని ఆఖరుకోరిక తీర్చిన వాళ్ళమవుతాము-నువ్వింకా చిన్నవాడివి. ఇప్పుడు నీ మనస్సు విరక్తితో కూడుకున్నా, కొన్నాళ్ళు పోయాకైనా, సంసారం సాగించటానికి-వివాహం, చేసికోవలసి వస్తుంది. కాస్తకష్టసుఖాలు ఎరుగున్నదాన్ని కనక చెబుతున్నాను. నాయినా-ఏవండీ వదినగారూ?" అన్నాది, సుబ్బారావు తల్లి వేపుచూస్తూ, సుందరమ్మ.

"అవునమ్మా! చనిపోయిన వాళ్ళకోసం ఎంత విచారించినా వాళ్లని తిరిగి తెచ్చుకోలేం. ఎదో బ్రతుకు తెరువు చూసుకోవాలి గాని" అన్నాది ఆమె తిరిగి.

"అది నీవల్ల సుఖపడే అదృష్టం లేకపోయింది గాని- దానికి నువ్వు పూలిక పుల్లంత కష్టమైనా కలుగ

జేయలేదు. ఇంత మంచివాడివి అల్లుడుగా అవటం నేను పూర్వ జన్మంలో చేసుకున్న పూజా ఫలితమే- మా యింట్లోను ఎదిగిన పిల్ల వుంది. ఎదో మీతో కలిసిన సమ్మంధం. మనకు, మనకు ఏ విషయంలోను పేచీలు రాలేదు. ఇంత అన్యోన్యమైన సమ్మంధం ఉభయత్రా కూడా కుదరడం కష్టమే! పిల్లకిప్పుడు పదమూడేళ్లున్నాయి. ఆర్నెల్లలో అంది వస్తుంది. ఎదో నాకు శక్తి వున్నంత మట్టుకు యింత వులుసూ అన్నం పెట్టి పెళ్ళి చేద్దామనింది- ఇలా చేసేటట్టయితే ఈ పసికకందు విషయంలో గూడా భయ పడవలసిన అవుసరం లేదు." అంది. "ఈ ఏర్పాటు చాలా బాగుంది తన చనిపోయిన అక్క తాలూకు కూతు గదా అని, కృష్ణవేణి ఈ పిల్లను అతి ప్రేమతో పెంచుతుంది. అదీ కాక రత్నాన్ని మరిపించగల శక్తి గూడా వుంది కృష్ణవేణిలో" అన్నాది సుబ్బారావు తల్లి.

సుబ్బారావు తండ్రిగూడా చాలా బాగుందన్నాడు. సుబ్బారావు అ పసిపిల్ల వేపు చూస్తూ "అలాగే" అన్నాడు.

* * *

అట్టే బెడద లేకుండా దేవాలయంలో పెళ్ళి జరిగిపోయింది.

* * *

కృష్ణవేణి కాపురానికొచ్చి, తన చాకచక్యం వల్ల, తిరిగి సుబ్బారావును సంతోష సామ్రాజ్యంలోకి తీసుకొచ్చింది. "Lost Paradise regained" లాగుంది సుబ్బారావుకు.

కృష్ణవేణి చిన్నపిల్ల- సంరక్షణ చెయ్యలేదని, సుందరమ్మ మనవరాల్ని తన దగ్గరే వుంచుకుంది; పెద్దదయాక పంపిద్దామని. ఈ పసిపిల్లకు, కృష్ణవేణి సుబ్బారావుల కోరికపైని, "రతన్‌బాయి" అని నామకరణం చేశారు.

౪

కాలచక్రం తిరిగి పోతున్నాది. పిల్లలు పెద్దదవుతున్నారు. పెద్దలు వృద్ధులవుతున్నారు. హృదయానందము గొల్పు కదళీ వృక్షంల్లాగ పెరిగింది రతన్‌బాయి. తిరిగి మాతృదేవి ప్రతిమ ప్రతిష్ఠ చేయగలిగింది.

రతన్‌బాయికి పద్నాలుగోయేడు వచ్చింది. మూడవ ఫారం ప్యాసయి చదువు మానేసింది. సంగీతంల్లో సాధారణ పాండిత్యం సంపాదించ గలిగింది. తన మృధు మధుర కంఠస్వరాన్ని, వీణా తంతువులతో సమానంగా చలింపజేసి, శ్రోతల హృదయ తంతువులను గూడా మీటగల శక్తిగలిగింది.

రతన్ వివాహానికి అట్టే శ్రమపడవలసి అవసరం లేదు. సుబ్బారావుకు, వూరూరా, కాళ్ల తిరిగి పోయేటట్టు తిరగడం, మధ్యవర్తుల జేబులు డబ్బుతో నింపడం, మొదలైన వ్యయ ప్రయాసలన్నీ తప్పిపోయాయి.-పెళ్ళికొడుకే వాళ్ళింట్లోమూడేళ్లా యతిష్ట వేసు కూర్చున్నాడు ఢంకామీద దెబ్బకొట్టి "చిన్న మావయ్యను తప్ప, ఇంకెవరినీ పెళ్లాడ"నంటున్నాది పెళ్లికూతురు.

—రతన్‌బాయిని చిన్నప్పుడు, ఎవరేనా "చిన్న మావయ్యని నిన్ను పెళ్లాడటలే!" అంటే, ఆరున్నొక్క రాయణ చేస్తూ, మురళీ దగ్గరకు వెళ్ళి "చిన్న మావయ్యా నన్ను పెళ్లాడవూ?" అనేది, ముత్యాలొలికే ముద్దు మాటలతో. ఆమెను ఓదార్చాలని వుంటే "తప్పకుండా నిన్నే పెళ్ళాడుతా నమ్మా" అని ఎత్తుకుని, ముద్దాడేవాడు. లేదూ- ఇంకా ఏడిపించాలని వుంటే "నిన్ను పెళ్లాడనులే" అనేవాడు కొంటెగా మురళీ—

మురళీకిప్పుడు ఇరవై యేళ్ళుంటాయి. బావగారింట్లో వుండి బి. ఏ. జూనియరు చదువుతున్నాడు.

ఈడూ, జోడు తగింది, అరమరలు లేని సమ్మంధం, చేసేవలసెందే అని అందరూ తీర్మానించారు.........

స్వస్తి శ్రీ భావనామ సంవత్సర, (నిజ) వైశాఖ, బహుళ, నవమీ, బుధవారం, (6-6-1934) రాత్రి, ఎనిమిది గంటల, ముప్పై నిమిషాలకు, రేవతి నక్షత్ర, యుక్తధనుర్లగ్న మందు, సుందరమ్మ గారింట్లో, వివాహం జరపడానికి నిశ్చయించారు....

సుందరమ్మగారి యిల్లంతా, బంధువులతోను, స్నేహితులతోను కిలకిల, లాడుతున్నాది. భాస్కరరావు వచ్చేవారిని ఆహ్వానిస్తున్నాడు. సుందరమ్మ వచ్చిన వారికి భోజన సదుపాయాలు చేస్తున్నాది. పాలు, నీళ్లు లాగ, మొగపెళ్ళి వారెవరో ఆడపెళ్ళి వారెవరో తెలుసుకోడం కష్టంగా వుంది. ఇంక లగ్నానికి రెండున్నర గంటల పైముంది.

ఇప్పుడో చిన్న పేచీ- చిన్న దేమిటి పెద్దదే- వచ్చింది. మురళీపైకి ఎంత సంతోషంగా వున్నా, లోపల ఏదో కోరిక, వూగులాడు తున్నాది. ఈ సమయంలో పైకి చెబుతే ఏవరే మనుక్కుంటారో? చెప్పక పోతే ఈ చిన్నతనం కలకాలం వుండిపోతుంది. తను ఎంతమేన కోడల్ని పెళ్లాడినా- కట్నం- అన్న లేక పోతే నలుగురిలోని చిన్న తనంగావుంటుంది. లగ్న సమయమందు, నలుగురి పెద్దల్లోను కట్నం చదివించక పోతే "ఎబ్బే! ఇంత ఆస్తి పరుడికి దమ్మిడీయేనా కట్నం ఇవ్వలేదురా?" అని నవ్వుతారేమో అన్న అనుమానం ఒకమూల; కాలేజీ కెళితే, స్నేహితు లంతమంది "ఏపాటి కట్నం పుచ్చుకున్నావురా?" అంటే, "ఏమీ కట్నం పుచ్చుకోలేదురా" అని చెబుతే, హేళనా పూర్వకంగా నవ్వేసి, చిన్నబుచ్చుతారేమో అన్న అనుమానం ఒక మూల వూరికే బాధిస్తున్నాయి.

ఇలాంటప్పుడు యువకులకు వివేకనాశక్తి నశించి పోతుంది. "వరశుల్కం పుచ్చుకో కూడదు" అని స్టేజీమీదికెక్కి వుపన్యసిస్తున్నప్పుడు వుట్టే వుద్రేకం నీళ్లు కారిపోతుంది. వీరికి మళ్లీ పండువాటం. వరశుల్కపిశాచం వల్ల అధోగతి పాలైన కుటుంబాల చరిత్రలు అప్పుడు జ్ఞాపకానికి రావు; వచ్చినాలో సిపారెస్తారు. అంతరాత్మ "వరశుల్కం వద్దు" అని ప్రభోదిస్తూనే వుంటుంది. ఈపాటి చిన్న విషయంలో గూడా- లోకులకు, సంఘానికి- దాసులవుతారు. ఇలాంటి వ్యక్తి స్వాతంత్ర్యం చంపుకొనే యువకులు- స్వబుద్ధి వుపయోగించుకో డానికి గూడా శక్తి లేని యువకులు- ప్రజాభిప్రాయానికి దాసోహం అనే యువకులు- సివిక్ లిబర్టీస్ కావాలి, సంఘం సంస్కరణం కావాలి, సంపూర్ణ స్వరాజ్యం కావాలి అని ఏముఖం పెట్టుకుని అడగ్గలరు. ఆడపిల్లలు గల కుటుంబాలు కూలిపోడానికి ఎవరు కారణం? అన్న ప్రశ్నకు ఢంకా మీద దెబ్బకొట్టి వరశుల్క పిశాచాన్ని ఆరాధిస్తున్న యువకులే అని జవాబు చెప్పడంలో సాహసం లేదు. తోటి కుటుంబాల ఆర్థికాభివృద్ధికి అడ్డు తగులుతున్న వీరు, ఏపాటి సామ్యవాదులు?

ఇప్పుడు మురళీ ఎవరిదగ్గర కట్నం పుచ్చుకోవాలి? తన అక్క భర్త దగ్గర పుచ్చుకుంటే, అక్క దగ్గర పుచ్చుకున్నట్టే గాదు? ఇదేం న్యాయం? ఇంటి ఆడపిల్లకు శక్తి వుంటే ఇంత పసుపు, కుంకం, వస్త్రాలు ఇవ్వాలి గాని; తిరిగి ఆమె దగ్గర పుచ్చుకోడమన్నది అన్న దమ్మునికి భావ్యం గాదు. ఒకవేళ సుబ్బారావు కట్నం ఇచ్చేటట్టయితే, హృదయంలో బాణాల్లాగ గుచ్చుకుపోయే సూటిపోటు మాటలు అక్కను అనటానికి అతనికి అవకాశం కలుగుతుందా? కలగదా? ఇప్పుడు మరో ప్రశ్న పుడుతుంది. "సుబ్బారావుకు సుందరమ్మగారు రెండు వివాహాలకు ఏపాటి కట్న మిచ్చారు?" దమ్మిడీ కట్నానికి ఆశపడకుండా- సుబ్బారావు- తన అక్కల్ని పెళ్ళాడినప్పుడు, తను ఏముఖం పెట్టుకుని సుబ్బారావును కట్నం అడగ్గలడు? పోనీ- "పిల్ల జాగ్రత్త! పిల్ల జాగ్రత్త!" అని పలవరిస్తూ చని

పోయిన తన పెద్దక్క ఆత్మ శాంతికోసమేనా కట్నంకోరడం మానీకూడదు? అయినా ఇప్పుడు సుబ్బారావు అంత డబ్బు ఎక్కణ్ణుంచితే గలడు? అప్పుచెయ్యాలి. ఆ రెండున్నర గంటల్లోను అప్పు దొరుకుతుందా? ఒకవేళ దొరికినా, తనకువచ్చే నలభైరూపాయల జీతంల్లోను తీర్చగలడా? మురళీ మూడేళ్లాయి (ఇంటరు జూనియరు దగ్గర్నుంచి, బి. ఏ. జూనియరువరకు) తన అక్క బావ లాపేదసంసారం ఈడుస్తున్నారో కళ్లారా చూస్తూన్నాడే. అన్నీ తెలుసుండి కట్నం అడగడం—దేశం దరిద్రమైన దని తెలుసుండి, ప్రభుత్వోద్యోగులు వేలకువేలు జీతాలు పుచ్చుకున్నట్టే వుంది.

చివరకు తన కడుపులో కోరికను, అన్నదగ్గర వెళ్లగక్కేడు. భాస్కర్రావు బాగా చీవాట్లు వేశాడు తమ్ముణ్ణి. శశామూరు ఒప్పుకోలేదు మురళీ. సుందరమ్మనయాన్ని, భయాన్ని చెప్పింది. కృష్ణవేణి ఎంతో ఖోదపరిచింది. బంధువు లందరు నచ్చచెప్పారు...ఊ ...ఊఁ......చెవిటివాడి చెవులో శంఖంవూదినట్టే అయింది.

చివరకు పెళ్ళి రసాభాసయి పోతుందని భయపడి, భాస్కర్రావు ఆ ఐదువందులు ప్రోనోటు మీద ఒక స్నేహితుడు దగ్గర అప్పుచ్చుకున్నాడు అప్పటికప్పుడు.

కాని ఈ గుంజులాటలన్నీ సుబ్బారావుకు తెలియనివ్వలేదు. తెలిస్తే "ఇలాంటి మూర్ఖుడికి పిల్లనివ్వ" నంటాడేమో? అప్పుడు అసలుకే మోసం వస్తుంది. సుబ్బారావు నిండు రిఫార్మరు......

పెళ్లికూతురు మెడలో మూడుముళ్ళు పడ్డాయి. ఇంక కట్నం చదివించవలసిన సమయం వచ్చింది. ఈ కట్నం సంగతి తెలిసున్నవాళ్ల గుండెలన్నీ పీచుపీచుమంటున్నాయి.

ఈ లోపున భాస్కర్రావు సుబ్బారావును ఒక గదిలోకి తీసుకెళ్లాడు. వారి వెనక్కాతల సుందరమ్మ, కృష్ణవేణి, సుబ్బారావు తల్లితండ్రిగూడా వెళ్లారు. మొదట ఈ కట్నం సంగతి వినేసరికి సుబ్బారావు చర్రుమని తోకతొక్కి పాములాలేచాడు. అందరు కలిసి శాంతింపజేశారు—మురళీ లోకజ్ఞానం లేనివాడు గనుక అలా ప్రవర్తించాడుగాని, కాస్త కష్టసుఖాలు తెలిసున్న సుబ్బారావుకూడా అలా తొందర పడకూడదని, మూడుముళ్లూ పడ్డాక అనవసరం దెబ్బలాటలు పెట్టుకుంటే అందరు నవ్వుతారని. ఇంతకే సుబ్బారావు చేతిది ఒక దమ్మిడీ పెట్టుకోనక్కర్లేదని-సంగతి సందర్భాలన్నీ వితరంగా చెప్పారు. ఒకవేపు తల్లితండ్రి చెబుతున్నారు. మరోవేపు అత్తగారు, బావమరది, భార్య చెబుతున్నారు. ఇంతమందిమాట తోసివెయ్యడానికి అతని మనస్సు వప్పుకోలేదు. అంచేత "సరే" అనవలసివచ్చింది.

ఈ లోపున పెళ్లీ పందిట్లో గుస, గుసలు ప్రారంభించాయి పరీక్ష ఫలితాలు తెలిపేరోజున విద్యార్థులు హెడ్మాస్టరుగారి రాకకోసం ఎంత ఆతృతగా చూస్తూవుంటారో, అలాగ ఎదురుచూస్తున్నారు పెళ్ళి వారందరు సుబ్బారావుకోసం. ఏ అల్లరిలేకుండా, సుబ్బారావు తన కుమార్తె వివాహ సమయమందు అల్లుడికి ఐదువందల పదహార్లు వెండీ పళ్ళెంలోపెట్టి ఇచ్చేశాడు. కాని- ఆ ఇచ్చేటప్పుడు మాత్రం అల్లుడవేపు ఒక్క కోరచూపు చూశాడు. దాంతో మురళీ వళ్లు ఝల్లుమంది.........

వివాహం జయప్రదాంగా జరిగిపోయింది.

చినమావయ్యనే పెళ్లాడి, తన పంతం నెరవేర్చుకున్నందుకు, రతన్ బాయిని అందరూ అభినందించారు.......

సుబ్బారావు ఇంటికి వియ్యాల వారందరు మణుగుడుపులుకొచ్చారు. ఇక్కడే ఒక చిన్న ఫార్సు జరిగింది.

మురళీ స్నేహితులందరు ఒక్కొక్కరే రావడం, మురళీకి "కంగ్రాట్యులేషన్సు" ఇవ్వడం మురళీ "థాంక్సు" అని తిరిగి అనడం మామూలే! కాని తరవాత వాళ్ళు "నీ వైఫ్ నిన్ను, ఎంత డబ్బిచ్చి కొనుక్కుందిరా?" అని అడగం, హేళనా పూర్వకంగా నవ్వడం మొదలుపెట్టారు. మురళీ ముఖం వెలవెల బారిపోయింది. పాపం! సిగ్గుపడిపోయి, మరి నోరెత్త లేకపోయాడు—ఒక్కరూ ఎంత కట్నం కొట్టేవురా?" అని తన మనస్సుకు తృప్తితీరా అడిగిన పాపాన పోలేదు. "డామిట్! కథ అడ్డంగా తిరుగుతే" ఎవరేమి చెయ్యగలరు? తన వ్యూహ సౌధాలన్నీ ఇంత లాకూలిపోతాయని అనుకోలేదు.

పెళ్ళిలో, కట్నం యిస్తూవుంటే సుబ్బారావు చూసిన కోరచూపుల ఫలితం ఇదే అని తెలుసుకున్నాడు. సుబ్బారావు కాలేజీలో అందరికి తలలో నాలుకవలె, సహాయభూతంగా వుండడంవల్ల, అతని మాట లెక్చరర్లు విద్యార్థులు పాటిస్తారు. పైఫార్సు అంతటికీ సుబ్బారావే కారణమని తెలుసుకున్నాడు మురళీ. కాని-తన బావగారు, మామగారు-అయిన సుబ్బారావును ఎపాలజీ కోరుకోడానికి మురళీకి కొంచెం సిగ్గువేసింది. మరి తప్పిందిగాదు. లేకపోతే లేడీ స్టూడెంట్సు, లెక్చరర్లుగూడా ఎగతాళి చేస్తారేమో?

ఒకనాడు సుబ్బారావు వంటరిగా వున్న సమయం చూసి, "బావా! ఇంత అమర్యాదా పాలుచేయడం బాగులేదు" అన్నాడు అతి దీనంగా.

"ఏవిటవిటి?"అన్నాడు సుబ్బారావు మీా తెరగనట్టు.

"నా ఫ్రెండ్సుచేత -,నన్నలా-అనిపించడం భావ్యం గాదు" అన్నాడు మురళీ వొణుకుతున్న కంఠంతో.

"నువ్వు చేసినపని బాగుందా?" అన్నాడు సుబ్బారావు.

"ఏదో తెలియక చేశాను—Excusre me—నన్ను కాలేజీలో-తల ఎత్తుకు తిరిగేటట్టు-చేస్తేగాని-బతకలేను? అన్నాడు మురళీ గద్గదస్వరంతో. కళ్ళలో నీళ్ళు గిరున తిరిగిపోయాయి.

సుబ్బారావు హృదయం నవనీతంలాగు కరిగిపోయింది.

"మురళీ! ఈపాటిదానికే అలాకళ్లంట నీళ్ళు పెట్టుకుంటూ వేమిటి? నేనుంటూ వుండగా నీకేంభయం?"

అని బుజ్జగిస్తూ ధైర్యంచెప్పేడు.

తను మురళీ స్నేహితులచేత అడిగించిన ప్రశ్నల వల్ల, మురళీ హృదయం ఎలాతూట్లు పడిపోయిందో గ్రహించాడు. సుబ్బారావు ఎంత తప్పుచేసినా---బావమరది, అల్లుడు- ఇంతకీతను చేసినతప్పు గ్రహించుకొని, పశ్చాత్తాప పడ్డాడు. అదే సుబ్బారావు కోరేది గూడాను. ఇక అట్టే అతని మనస్సుకు నొప్పి కలుగజేస్తే, దుర్బల హృదయుడవటంవల్ల విరక్తి పుట్టిపోయి, ఒక్కొక్కప్పుడు- ఆత్మహత్యకు- గూడా పాల్పడవచ్చు.

వెంటనే సుబ్బారావు మురళీ స్నేహితులతో జరిగిన సంగతంతా అతి హృదయ విదారకంగా చెప్పేడు, వాళ్లకు కూడా జాలివేసి, ఈ సంగతి పైకి పొక్కకుండా తగిన జాగ్రత్త తీసుకుంటామని మాట యిచ్చారు.

కొన్నాళ్లవరకు మురళీ స్నేహితులతో స్వేచ్ఛగ తిరగటానిగ్గాని, మాట్లాడ్డానిగ్గాని సిగుపడిపోయేవాడు.

*  *  *

ఆర్నెలయాయి అడుగంటి పోయిన ఈ ప్రశ్న, మళ్ళా తన భార్యానోటంట శోభనం నాడు రాత్రి విన్నాడు మురళీ. "ఏమండీ! చినమావయ్యగారూ! ఐదువందలిచ్చి మిమ్మల్ని కొనుక్కున్నప్పుడు, తమల పాకులు ఎందుకు అందివ్వాలండి?" అన్నాది రతన్‌బాయి, ఇద్దరూ మాంచికైమాక్సులో వున్నప్పుడు.

"రతన్! ఆ ప్రశ్నవల్ల ఇదివరకు నా హృదయానికి పడ్డ గాయాలు ఇంకా మానలేదు. మళ్లా మరో కటా? చెప్పూ!" అన్నాడు కొంచెం కష్టంగా; తమలపాకులు అందుకుంటూ.

"అయితే క్షమించండి" అన్నాది రతన్‌బాయి అతని రెండుచేతులు పట్టుకుని......
కట్నం కోసం తెచ్చిన ఐదువందలు పెళ్ళిఖర్చులు పెట్టేశాడు భాస్కర్రావు, ఆ అప్పు అసలు వడ్డీలతో పెరుగుతున్నాది పాపం పెరిగినట్టు. తన స్వల్ప జీవితంలో తీర్చలేకపోయాడు. చివరకొకనాడు చెప్పలేక, చెప్పలేక తమ్ముడితో చెప్పాడు. మురళీ తనకు వచ్చే భూమిశిస్తులోంచి, తీర్చవలసి వచ్చింది, అసలు వడ్డీలతో ఆరు వందలూను.

"అరుంధతీనక్షత్రం కనబడ లేదుగాని, ఆరు వందలు అప్పుమాత్రం కనిపిస్తున్నాది" అన్న సామెత సార్థకమయింది.


## హస్తరేఖాశాస్త్రము



విశదముగా తెలియగల 300 చిత్రములతోగూడి స్త్రీలు బాలుర సైతము చదువుట కనుకూలించు తేట తెల్లంమగు నాంధ్ర వచనరూపమగు నీగ్రంథముచేత ఆయుస్సు వివాహలాభము, గుణము, శక్తి, బుద్ధి అదృష్టము, సంతానము, లౌకిక సుఖము వ్యాజ్యము. శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొన వచ్చును. ఇంకను, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటి లోను యిది యగ్రస్థానంబును వహించియున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంథము కల్పవృక్షము వంటిదని దీని నామూలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట నెంతయు సందియంబు లేదు. దీని వెల 2-0-0.

సౌకారుపేట, ఆనందబోధిని ఆఫీసు. మదరాసు.